సాక్షి సంగారెడ్డి

శనివారం । 20 । జనవరి । 2024



జాతర చూసొద్దాం

జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌నర్సపూర్‌లోని కొండపోచమ్మ దేవాలయం జాతరకు ముస్తాబైంది. ఈ నెల 22 నుంచి జాతర ప్రారంభం కానుంది. వివరాలు 8లో ▸



మత్తు పదార్థాలపై నిఘా

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, జూదం వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణచివేయాలని సీపీ అనురాధ ఆదేశించారు. వివరాలు 8లో ▸

విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణఖేడ్: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఖేడ్ పట్టణంతోపాటు డివిజన్ పరిధి మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

సంగారెడ్డి టౌన్ : ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ఇవి కొనసాగుతాయని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చని చెప్పారు.

భక్తి మార్గంతోనే ముక్తి



పాదయాత్రలో జ్ఞానేశ్వర్ మహారాజ్, భక్తులు

మునిపల్లి(అందోల్): ప్రజలు భక్తి మార్గంలో నడవాలని జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ అన్నారు. శుక్రవారం అంతారం జీవన్ముక్త సంస్థానం నుంచి ఏడుపాయల ఆలయం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిశ్చలమైన మనస్సుతో నిత్యం భగవంతుని నామస్మరణ చేయాలని తెలిపారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. పాదయాత్రలో సుమారు 50 మంది భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న హరీశ్‌రావు

నారాయణఖేడ్: మండల పరిధి పలుగు తండాకు చెందిన వడిత్యా రజని (26) ఏడాదిన్నర క్రితం సికింద్రాబాద్‌లో ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందింది. ఆమెకు భర్త విష్ణుతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రైల్వేశాఖకు సిఫారసు చేశారు. ఈ మేరకు పరిహారం కింద రూ.9.20లక్షలు మంజూరు చేసింది. సంబంధిత చెక్కును శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతురాలి భర్తకు అందజేశారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి, సీతారాం తండా సర్పంచ్ రాజునాయక్ తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి



గోదావరి అంజిరెడ్డిని సన్మానిస్తున్న నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గ్రామాల్లో బీజేపీని శక్తివంతంగా తయారు చేస్తామని నూతనంగా నియమించబడిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమెను పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జగదీష్, నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్, కిషోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయండి



మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

నారాయణఖేడ్: ప్రతీరోజు అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతల హాజరు, టీహెచ్‌ఆర్, హెచ్‌సీఎం, ప్రీస్కూల్ కృత్యాల వివరాలు పోషణ్‌ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత, పోషణ్ అభియాన్ జిల్లా సహాయ సమన్వయకర్త నవీన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఖేడ్‌లో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లబ్ధిదారుల ఆధార్, సెల్ నంబర్ల వెరిఫికేషన్‌ను వందశాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతీనెల పిల్లల బరువు, ఎత్తు కొలిచి తప్పులు లేకుండా పోషణ్ ట్రాకర్ యాప్‌తోపాటు ఎస్‌హెచ్‌టీఎస్ యాప్‌లో తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని అన్నారు. దేవకృప, చంద్రకళ, ప్రశాంతి, సుజాత, ప్రమీల, జమున, స్వరూప పాల్గొన్నారు.

రసవత్తర రాజకీయం

- ఫిబ్రవరి 2న 'ఖేడ్' మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశం
- కౌన్సిలర్లకు నోటీసులు
- అందోల్‌లో వెనక్కి తగ్గిన కాంగ్రెస్
- సంగారెడ్డి బీఆర్‌ఎస్ తర్జనభర్జన

బల్దియాలలో అవిశ్వాసాల అలజడి



రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు కూడా వేగంగా మారుతున్నాయి. మరో ఏడాది పాటు పదవీకాలం ఉన్న మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలకు తెర లేపుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాలక వర్గాలపై సొంత పార్టీ సభ్యులే అవిశ్వాసం ప్రకటిస్తున్నారు. - సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

జిల్లాలో మొత్తం ఎనిమిది మున్సిపాలిటీలుండగా ఇప్పటికే నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీర్, వైస్ చైర్మన్ పరుశురాంలపై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును అధికారులకు అందజేసిన విషయం విదితమే. ఇక్కడ బీఆర్‌ఎస్ నుంచి పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసానికి సై అన్నారు. దీంతో అధికారులు ఫిబ్రవరి 2న ప్రత్యేక సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై బల నిరూపణ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ఈ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం కాంగ్రెస్ ఖాతాలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా సదాశివపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై కూడా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నోటీసును అధికారులకు అందజేశారు. దీనిపై కూడా అధికారులు బల నిరూపణ కోసం త్వరలో మున్సిపల్ సమావేశం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

కాగా నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరగా, సదాశివపేటలో మాత్రం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లే ఆ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌ను గద్దె దించే ప్రయత్నాలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ బీఆర్‌ఎస్‌తో పాటు, కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ ఖాతాల్లో ఉన్న మున్సిపాలిటీలను క్రమంగా తమ వశం చేసుకునేందుకు హస్తం పార్టీ పావులు కదుపుతోంది.

అందోల్‌లో వెనక్కి తగ్గిన కౌన్సిలర్లు..

అందోల్ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్యపై కూడా అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు భావించారు. ఈ మేరకు గట్టి ప్రయత్నాలు చేశారు. కానీ తర్వాత విరమించుకున్నారు. ఇదిలా ఉండగా.. ఇక్కడ చైర్మన్‌గా ఉన్న మల్లయ్యను మార్చి, మరొకరికి పదవిని అప్పగించాలని స్థానిక బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు భావించారు. ఇటీవల సంగారెడ్డిలో సమావేశమైన ఆ పార్టీ కౌన్సిలర్లు మల్లయ్యను తన పదవికి రాజీనామా చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఇందుకు ఆయన అంగీకరించ లేదు. అయితే మల్లయ్యను గద్దె దించేందుకు అవసరమైన సంఖ్యా బలం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వ్యవహారం ముందడుగు పడలేదని స్థానిక బల్దియా వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ మల్లయ్య కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

సంగారెడ్డి తర్జన భర్జన..

సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లలోనే తర్జన భర్జన కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. అప్పట్లో పలువురు చైర్‌పర్సన్‌లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం.. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ వ్యవహారం మరుగున పడింది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభు త్వం మారిన నేపథ్యంలో అవిశ్వాసంపై ముందుకు వెళ్లాలా.. వద్దా.. అనేదానిపై ఆ పార్టీ కౌన్సిలర్లు మదన పడుతున్నారు. సుమారు పది మంది వరకు సభ్యులున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు మా త్రం వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారు.

ఆ మూడు బల్దియాలలో..

అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సంఖ్యా బలం ఎక్కువగా ఉంది. దీంతో ఈ మూడు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన వ్యవహారం ఇప్పటి వరకు బయటకు పొక్కలేదు. కాగా మున్సిపాలిటీల పాలక వర్గాలకు ఇంకా ఒక సంవత్సరం మాత్రమే గడువు ఉంది. అవిశ్వాస తీర్మానాలు నెగ్గాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. మద్దతిచ్చే కౌన్సిలర్లకు రూ.లక్షల్లో నజరానా ముట్టజెప్పాల్సి ఉంటుంది. ఏడాది పదవి కోసం భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో పలువురు సభ్యులు అవిశ్వాసం పెట్టడానికి పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మాట్లాడుతున్న మంత్రి దామోదర



ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ భూములు, నీటి వనరులు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించే బాధ్యత అధికారులదేనని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అలాగే అనుమతి లేని నిర్మాణాలు, లేఅవుట్స్, అక్రమ మైనింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇల్లీగల్ మైనింగ్‌పై తీసుకున్న చర్యల వివరాలు 15 రోజుల్లోగా నివేదిక అందించాలని ఏడీని ఆదేశించారు. జిల్లాలో బెల్ట్ షాపులన్నింటినీ మూసివేయించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. వసతి గృహాలలో సదుపాయాల కోసం ప్రతిపాదనలు అందిస్తే నిధులు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ బ్లాక్ ఒకటి త్వరగా అందుబాటులోకి తేవాలని సంబంధిత ఏజెన్సీని కోరినా పూర్తిచేసి ఇవ్వడం లేదని ప్రిన్సిపాల్ వాణి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పనులు చివరి దశలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్‌ఓ, ఆర్డీఓలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

రెవెన్యూ శాఖకు సంబంధించిన డైరీని మంత్రి దామోదర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఎలా ఉండాలి, ధరణి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు మంత్రికి నివేదిక అందించారు.

పాత పద్ధతి కొనసాగించాలి

సంగారెడ్డి : పాత పద్ధతిలో గ్రామ సేవకులను వెనక్కి తీసుకోవాలని మంత్రి దామోదరకు శుక్రవారం వినతిపత్రం అందించారు. అల్లాదుర్గం మండలానికి చెందిన గ్రామ సేవకులు పట్టణంలో మంత్రిని కలిసి వీఆర్‌ఏ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు.

పటాన్‌చెరు టౌన్: పారిశ్రామికవాడ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ పారిశ్రామికవేత్తలు మంత్రి దామోదరను కోరారు. సబ్సిడీలు రావడం లేదని తెలిపారు. హనుమంతరావు, రమేష్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

సంచార జాతరకు స్వాగతం

జహీరాబాద్: మండలంలోని శేఖా పూర్, జంలై తండాలలో శుక్రవారం పాత పంటల సంచార జాతర నిర్వహించారు. చిరు ధాన్యాలతో వచ్చిన ఎడ్ల బండ్లకు గిరిజనులు నృత్యాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. తండాల్లో చిరుధాన్యాలనే పండిస్తున్నామని రైతులు తెలిపారు. సేంద్రియ విధానంలో 15 నుంచి 25 రకాల పంటలను సాగుచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగు చౌహాన్, ఎంపీటీసీ ప్రేమ్ సింగ్, చాందిబాయి పాల్గొన్నారు.



ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

డంప్ యార్డు పనుల అడ్డగింత

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో చేపడుతున్న సంగారెడ్డి మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇక్కడ డంప్ యార్డ్ నిర్మాణం చేపట్టవద్దని స్థల పరిశీలనకు వచ్చిన సంగారెడ్డి మున్సిపాలిటీ టీపీఓ చంద్రశేఖర్, శానిటరీ ఆఫీసర్ విజయబాబులకు తెలిపారు. ఇప్పటికే క్రషర్, పరిశ్రమల కాలుష్యంతో గ్రామంలో ఉండలేని పరిస్థితి నెలకొందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సంగారెడ్డి, కంది, హత్నూర మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు చదివే మోడల్ స్కూల్‌కు అతి సమీపంలో డంప్ నిర్మాణం ఎలా చేస్తారని నిలదీశారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయంతి శ్రీధర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ వార్డు సభ్యులు కృష్ణ, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ మన్నే ప్రభాకర్ యాదయ్య, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



డంపింగ్ యార్డ్ పనులను అడ్డుకుంటున్న ప్రజా ప్రతినిధులు

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనార్టీలకు 60 సీట్లు, నాన్ మైనార్టీలకు 20, 6వ తరగతిలో మైనార్టీలకు 12, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 4 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో (ప్రథమ సంవత్సరం) 40 సీట్లకు గాను మైనార్టీలకు 30, నాన్‌మైనార్టీలకు 10 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పూర్తి వివరాలకు 9440054943, 7995057963 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గ్యాస్.. ఉచిత విద్యుత్‌కే..



సాక్షి, సిద్దిపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించింది. గత డిసెంబర్ 28వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు పట్టణాలు, గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించిన విషయం విదితమే. వీటిలో అధికంగా రూ.500కు గ్యాస్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 9.42లక్షల దరఖాస్తులు రాగా అందులో ఐదు గ్యారంటీలకు గాను 11 పథకాలకు 42.67లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో డీటీపీ ఆపరేటర్ల ద్వారా ఈ నెల 18వ తేదీ వరకు నమోదు చేయించారు. త్వరలో ప్రభుత్వ ఆదేశాలతో ఇంటింటికీ తిరిగి విచారించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.

జిల్లా పేరు	దరఖాస్తులు
సిద్దిపేట	3,25,214
సంగారెడ్డి	3,91,565
మెదక్	2,25,594

ఉమ్మడి మెదక్‌లో..

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 9,42,373 దరఖాస్తులు రాగా అందులో ఐదు గ్యారంటీలలో 11 పథకాలకు 42,67,530 దరఖాస్తులు వచ్చాయి. మహాలక్ష్మి (మహిళలకు నెలకు రూ.2,500 నగదు బదిలీ), రైతు భరోసా (ఎకరానికి ఏడాదికి రూ.15వేలు, కౌలు రైతుకు సాయం), గృహజ్యోతి పథకం (రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్‌ల లోపు ఉచిత విద్యుత్), ఇందిరమ్మ ఇళ్లు (ప్రతి లబ్ధిదారునికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు, తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ఇంటి స్థలం), చేయూత పథకం (నెలకు రూ.4వేలు పింఛన్)ల కోసం ఒకే దరఖాస్తులో స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో అధికంగా గ్యాస్‌కు 2,83,767 దరఖాస్తులు, ఉచిత విద్యుత్‌కు 2,67,734, సంగారెడ్డిలో మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2,500ల కోసం 3,53,391, గ్యాస్‌కు 3,41,888, మెదక్ జిల్లాలో గ్యాస్ కోసం 1,95,297, ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,93,096 దరఖాస్తులు వచ్చాయి.

ప్రజాపాలనలో వీటికే అధికంగా దరఖాస్తులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,42,373 అప్లికేషన్లు
- తెల్ల కాగితంపై రాసిచ్చిన వాటిపై స్పష్టత కరువు

కానరాని ఎడిట్ ఆప్షన్

దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే సమయంలో పొరపాటున తప్పుగా నమోదు అయితే వాటిని సవరణకు అవకాశం లేకుండా పోయింది. ఎలాంటి ఎడిట్ ఆప్షన్ అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇంటింటికీ వెళ్లి విచారణ చేసే సమయంలో తప్పులు బయట పడనున్నాయి.

స్పష్టత ఇవ్వని అధికారులు

ఐదు గ్యారంటీలే కాకుండా రేషన్ కార్డులు, ఇతర వాటి కోసం తెల్ల కాగితాలపై దరఖాస్తులను స్వీకరించారు. వాటిని గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. వాటి పై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో దరఖాస్తు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

ఎట్టకేలకు మోక్షం!

- 29న ఎస్‌ఎంసీ ఎన్నికలు
- నేడు నోటిఫికేషన్ విడుదల
- నాలుగేళ్ల తర్వాత నిర్వహణ

నారాయణఖేడ్: ఎట్టకేలకు పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు మోక్షం కలిగింది. సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వీటికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొననుంది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన షెడ్యూల్ విడుదల చేశారు. దానిని జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. శనివారం ఎన్నికల సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నెల 29న ఎస్‌ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎస్‌ఎంసీల పాత్ర కీలకం. 2019లో ఎన్నికలు జరగగా ఈ కమిటీలు కొలువుదీరాయి. ఆ తర్వాత కోవిడ్ ప్రభావంతో అప్పటి నుంచి ఇప్పటివరకు పాత కమిటీలనే కొనసాగిస్తూ వచ్చారు.

షెడ్యూల్..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉదయం 10 గంటలకు ఎస్‌ఎంసీల ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రధానోపాధ్యాయులు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీసు బోర్డుపై ఉంచుతారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 22వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తెలియజేయవచ్చు. తుది జాబితాను 24న ఉదయం 11గంటలకు ప్రతీ పాఠశాల నోటీసు బోర్డులో ఉంచుతారు. 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరుగుతాయి. 1 నుంచి 8వ తరగతుల్లో సభ్యులను ఎన్నుకున్న తర్వాత.. మధ్యాహ్నం 1.30గంటలకు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ తర్వాత అదేరోజు సాయంత్రం 2గంటల నుంచి 4గంటల మధ్య కొత్త కమిటీ సమావేశం జరుగుతుంది.

ఎన్నిక ఇలా..

జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలలో 15మంది, ప్రాథమికోన్నత పాఠశాలలో 21మంది సభ్యులను ఎన్నుకుంటారు. పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరుగుతుంది. ఆరుగురు ఎక్స్‌అఫిషియో, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్‌ఎంసీల ఏర్పాటు జరిగింది. సదరు బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన వారు రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. వారి పిల్లలు పాఠశాలను వదిలి వెళ్లినప్పుడు పదవి కోల్పోతారు. ఓటర్ల జాబితాలోని తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటు వేసేందుకు అర్హులు. ఓటర్లలో 50శాతం మంది హాజరు కాకపోతే కోరం లేనట్లే. సభ్యులు చేతులెత్తే పద్ధతి, లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. తప్పని పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహిస్తారు. 1–8 తరగతుల్లో ప్రతీ క్లాసు నుంచి ముగ్గురు సభ్యులను ఓటర్లయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు విధిగా ఉండాలి. ఏకగ్రీవానికి వీలు కాని పక్షంలో చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక చేపడతారు. పాఠశాల హెచ్‌ఎం, మున్సిపల్ పరిధిలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్త, హెల్త్ వర్కర్, మహిళా సమాఖ్య అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థల నుంచి ముగ్గురికి తక్కువ కాకుండా ఎంఈఓ కోఆప్షన్ సభ్యులను ఎంపిక చేస్తారు. ఎన్నికైన వారిలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాలి.



జిల్లాలో పాఠశాలలు	
ప్రాథమిక	864
ప్రాథమికోన్నత	199
ఉన్నత	203
ఆదర్శ	10
కస్తూర్బాలు	17

ప్రత్యేక సమావేశం

కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధివిధానాలు వివరించి మొదట ప్రతీ తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుని.. ఆ తర్వాత మళ్లీ ప్రత్యేక సమావేశమై చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఎక్కువమంది పోటీలో ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు.

బడులు బాగు...



కొత్త కమిటీల ఆధ్వర్యంలో బడుల బాగుకు బాటలు పడతాయని ఆశిస్తున్నాం. ప్రస్తుత ఎస్‌ఎంసీలు 30 నవంబర్ 2019లో ఎన్నికై సుదీర్ఘ కాలం బాధ్యతలు నిర్వహించినట్లు అయ్యింది. ఎస్‌ఎంసీల ఎన్నిక ప్రక్రియ అకాడమిక్ ఇయర్ ప్రారంభంలోనే జరిపి ఉంటే బాగుండేది.

– మడుపతి నరేష్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

నేడు నోటిఫికేషన్



ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈనెల 20న జారీ చేస్తాం. ఎంఈఓల ద్వారా అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం అందించాం. పాఠశాలల వారీగా ఓటరు జాబితా సిద్ధంగా ఉంది. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తాం.

– ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

రిపబ్లిక్ డే పరేడ్‌కు గిరిజన యువతి ఎంపిక


ఇస్లావత్ స్వప్న

మద్దూరు(హుస్నాబాద్): దేశ రాజధాని ఢిల్లీలో 26వ తేదీన జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు మండలంలోని హనుమతండా గ్రామ పరిధిలోని పంతులు తండాకు చెందిన ఇస్లావత్ సునీత, గోపి దంపతుల కూతురు ఇస్లావత్ స్వప్న ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఐటీబీపీ పోలీస్ ఫోర్స్ నుంచి స్వప్న పరేడ్‌కు ఎంపికైంది. స్వప్న 2021లో ట్రైనింగ్ పూర్తి చేసుకొని నేపాల్ సరిహద్దులో సైనికురాలిగా విధులు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దూల్మిట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, గ్రామస్తులు స్వప్నను అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పది మంది జిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. అక్కడ రాణిస్తే సదరన్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాశాఖ అధికారులు అభినందించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


నర్సమ్మ(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని గుట్టకిందిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పచ్చ నర్సమ్మ (40) గురువారం రాత్రి బయటకు వెళ్లగా విద్యుత్ స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే వైర్ తెగిపడి ఆమెపై పడింది. వెంటనే నర్సమ్మ స్పృహ కోల్పోయింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు ఆమెను మెదక్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నర్సమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలుకు భర్త లక్ష్మీనారాయణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఫ్లెక్సీ తెచ్చిన తంటా..

సంగారెడ్డిలో ఆటో బోల్తా


ఫ్లెక్సీని ఢీకొట్టిన ఆటో

సంగారెడ్డి: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వివిధ కార్యక్రమాలకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు ప్రజల ప్రాణాలమీదకు తెస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి, ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డుకు అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో ప్రయాణికులు గమనించకుండా వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం వాటర్ క్యాన్లతో వస్తున్న ఓ ఆటో ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి అందులో ఉన్నవారికి గాయాలు అయ్యాయి. కొంతవరకు ఆటో డ్యామేజ్ అయ్యింది. నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారీతిలో ఫ్లెక్సీలు ఏర్పాట్లు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జాతర చూసొద్దాం

- 22వ తేదీ నుంచి కొండపోచమ్మ జాతర ప్రారంభం
- ఉగాది వరకు వైభవంగా..
- మూడునెలలపాటు భక్తుల కోలాహలం
- కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా నమ్మకం



మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామంలోని శ్రీ కొండపోచమ్మ దేవాలయం జాతరకు ముస్తాబైంది. కొమురవెల్లి మల్లన్నకు కోటి దండాలు.. కొండపోచమ్మకు ముక్కోటి దండాలు.. కరుణించి కాపాడే తల్లి పోచమ్మ.. శతకోటి దండాలు.. అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కొలిచిన వారికి కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే కొండపోచమ్మకు భక్తులు పోటెత్తనున్నారు. లక్షలాది మంది భక్తుల నడుమ మూడునెలలపాటు అంగరంగ వైభవంగా కొండపోచమ్మ జాతర కొనసాగుతుంది.

జగదేవ్‌పూర్(గజ్వేల్)


కొండ పోచమ్మ దేవాలయం

తెలంగాణ ప్రాంతంలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ కొండ పోచమ్మ దేవస్థానం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉంది. కొండపోచమ్మ నామంతో జగత్‌ప్రసిద్ధి పొందిన జగన్మాతశీలాదేవి వేలాది మంది భక్తులకు ఆరాధ్య దైవమై నిత్య పూజలందుకుంటుంది. ఈ జాతర 22న ప్రారంభమై ఉగాది వరకు జరుగుతుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు.

ఆలయ చరిత్ర...

ఈ దేవస్థానం హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారి మధ్యన గల కొండకండ్ల గ్రామం నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. చేర్యాల మండల పరిధిలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారికి స్వయాన చెల్లెలని ప్రతీతి. కొన్ని వందల ఏళ్ల కిందట కొండపోచమ్మ కూడా కొమరవెల్లిలోనే ఉండేదని భక్తుల నమ్మకం. ఒక సందర్భంలో సోదరుడు మల్లన్న స్వామిపై అలిగి తీగుల్ నర్సాపూర్‌లోని దట్టమైన అడవుల్లో స్థిరపడగా అన్న మల్లన్న వచ్చి ఇంటికి పోదామని కోరగా మొండికేసిందట. మల్లన్న ఏ వరం కావాలో కోరుకోమంటే కొమరవెల్లికి వచ్చే ప్రతి భక్తుడూ తన వద్దకు వచ్చి దర్శనం చేసుకునేలా వరమివ్వాలని కోరిందట. మల్లన్న వరం ఇవ్వడంతో ఇక్కడ వెలిసిందని పూర్వీకులు చెబుతుంటారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి..

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకూండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జనగామ బస్సు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆది, సోమ, మంగళ వారాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశం ఉందన్నారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

బోనాలు వైభవంగా..

జాతరలో పాల్గొనే భక్తులు దేవాలయం ముందున్న చెరువులో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం అమ్మవారికి బోనాన్ని సమర్పిస్తారు.హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి వచ్చే భక్తులు తీసే లష్కర్ బోనాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గుడి వద్ద ఉన్న చెట్టుకు భక్తులు ముడుపులు కడుతుంటారు. కోరికలు తీరగానే ముడుపులు అమ్మవారికి చెల్లిస్తారు.



కిలకిలా రావాలు.. ముచ్చట గొలిపే అందాలు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆహారాన్వేషణలో పక్షులు మిరుదొడ్డిలోని పెద్ద చెరువులో సందడి చేశాయి. చెరువు గట్లు, చెట్లపై సేద తీరాయి. కొమ్మ కొమ్మకో పక్షి వాలి చూపరుల కంటిని ఆకర్షించాయి. రెక్కలు విప్పిన పక్షులు, గట్లపై వాలిన పక్షులు చెరువు ప్రకృతికే వన్నె తెచ్చాయి. ఉదయం, సాయంత్రం పూట పక్షుల సందడిని పక్షి ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు.





మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్

కొండపాక(గజ్వేల్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి(డీఆర్‌డీఓ) జయదేవ్ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో బ్యాంకుల నుంచి మహిళలు తీసుకున్న రుణాల వినియోగంపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణ సహాయం పొందే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించుకుంటూ మరింత ఎక్కువ రుణ సహాయాన్ని పొందాలన్నారు. మహిళలు బ్యాంకుల ద్వారా పొందిన రుణంతో ఏర్పాటు చేసుకున్న కారంపొడి ప్యాకెట్స్


పిండి గిర్ని యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్

తయారీ, పసుపు, అల్లం వెల్లుల్లి యూనిట్‌లను సందర్శించి లాభనష్టాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు పీడీ రవీందర్, డీపీఎం విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్, సీబీఓ ఆడిటర్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా


సమీక్షలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

- సిద్దిపేట పోలీసు కమిషనర్ బీ.అనురాధ
- పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో సమీక్ష

సిద్దిపేటకమాన్: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, పేకాట, జూదం వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణచివేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ బీ.అనురాధ ఆదేశించారు. శుక్రవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఏసీపీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతీ అధికారి నిజాయితీగా విధులు నిర్వహించి, అన్ని విభాగాల్లో బాగా పని చేసి సిద్దిపేట కమిషనరేట్‌ను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రతి నెలా రివార్డ్స్, అవార్డులు అందజేస్తామన్నారు. మహిళల రక్షణ చట్టాల గురించి షీటీమ్స్, కళాబృందం కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, సతీష్, రమేష్, ప్రసన్నకుమార్, చంద్రశేఖర్, రవీందర్‌రాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాశ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్‌కు శిక్షణ

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్‌స్టేషన్‌కు సైబర్ నేరాలకు సంబంధించి దరఖాస్తు రాగానే స్పందించి కేసు నమోదు చేయాలని సీపీ అనురాధ సూచించారు. సీపీ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌గా నియమించిన సిబ్బందికి శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ నేరాల ఛేదన గురించి కమిషనరేట్ పరిధిలోని ప్రతీ పోలీసు స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ను సైబర్ వారియర్‌గా నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ సైబర్ వారియర్స్ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

నేడు, రేపు స్వేరోస్ నెట్‌వర్క్ బూట్ క్యాంపు

గజ్వేల్: పటాన్‌చెరులోని అంబేడ్కర్ భవన్‌లో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న బూట్ క్యాంపును విజయవంతం చేయాలని ఈ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని క్రిష్ణ కోరారు. గ్రామగ్రామాన నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏడేళ్ల తర్వాత అరెస్ట్

కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న నిందితుడు

కోహెడరూరల్(హుస్నాబాద్): కోర్టుకు హాజరుకాకుండా 7 ఏళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఓ నిందితుడిని ముంబై పోలీసుల సాయంతో అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు హుస్నాబాద్ సీఐ కిరణ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. 2014లో కోహెడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మహంకాళీ అమరేందర్ కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అమరేందర్‌పై నాన్ బెయిలబుల్ వారెంటు ఇష్యూ చేసినట్లు తెలిపారు. నిందితుడు బెహరాన్ నుంచి ముంబైకి రాగా అక్కడి పోలీసుల సాయంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం

పటాన్‌చెరు టౌన్: బాలికపై అత్యాచారం జరిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన పెద్దిరాజు పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. అలాగే, నారాయణఖేడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ స్థానికంగా ఉంటూ పెద్దిరాజు వద్దకు కూలి పనికి వెళ్తుంది. ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడడంతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. అయితే కొద్దిరోజుల క్రితం మహిళ లేని సమయంలో ఇంటికి వెళ్లిన పెద్దిరాజు ఆమె కూతురి(13) పై అత్యాచారం చేశాడు. శుక్రవారం కూతురు అనారోగ్యంగా ఉండడం గమనించిన తల్లి నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. వెంటనే ఆమె పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా



పట్టుబడిన 21 మంది

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలు, జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం, గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, ఇందులో నలుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డిలో ఏడుగురికి..

సంగారెడ్డి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జరిమానా విధించినట్లు పట్టణ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని కింది బజార్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి ఏడుగురు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.

ఓటరు జాబితా సవరణకు దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేటరూరల్: ఓటరు జాబితాలో తప్పుల సవరణకు దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఈనెల 20, 21వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌లో ప్రతి బీఎల్ఓ పోలింగ్ బూత్‌లో అందుబాటులో ఉండాలని, తప్పుల సవరణకై ఓటర్లు అందించే దరఖాస్తులను స్వీకరించాలన్నారు. శుక్రవారం సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఈనెల 27 లోపు నమోదు చేసుకోవాలన్నారు.

నాటు సారా పట్టివేత

వ్యక్తిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి, కుందనవానిపల్లి గ్రామంలో గురువారం రాత్రి అబ్కారీ శాఖ సీఐ పవన్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్ నేతృత్వంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మంజ్యానాయక్ తండాకు చెందిన ముడావత్ తిరుపతి వద్ద సుమారుగా 10 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తండాల్లో గుడుంబా తయారీ విధానాన్ని అరికట్టేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్స్ రాజు, సతీష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నాటు సారాను పట్టుకున్న పోలీసులు

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నగదు, ఫోన్లు, వాహనాలు స్వాధీనం

సంగారెడ్డి: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రూపేశ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీస్ బృందాలు తనిఖీలు చేస్తున్నారన్నారు. శుక్రవారం పుల్కల్ మండలం ఒన్నపురం గ్రామ శివారులోని నిమ్మకాయల కిరణ్ రెడ్డి వ్యవసాయ భూమి వద్ద పేకాట ఆడుగున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే అక్కడ దాడులు నిర్వహించి కూకట్పల్లికి చెందిన నిమ్మకాయల కిరణ్ రెడ్డి, సంగారెడ్డికి చెందిన కాళిదాస్ యాదగిరి, కొర్పోల్ గ్రామవాసి పట్లోళ్ల హనుమంత్ రెడ్డి, షాపూర్ నగర్ వాసి గుడిదొడ్డి శివరాం రెడ్డి, గుమ్మడిదలకు చెందిన శివరెడ్డి, సంగారెడ్డి వాసి నాగిరెడ్డి , తెల్లాపూర్ ప్రసాద్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.62,500 నగదు, రెండు కార్లు, బైక్, స్కూటీ, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పుల్కల్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నామని ఎస్పీ వివరించారు.

డీసీఎం బోల్తా ఒకరు మృతి

హత్నూర(సంగారెడ్డి): డీసీఎం బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. హత్నూర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సప్లయ్ చేసే డీసీఎం వ్యాన్ డ్రైవర్ మధుసూదన్ రెడ్డి మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతో నాగారం గ్రామ శివారులోని టర్నింగ్ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో కూలీగా పనిచేసే సంగారెడ్డి పట్టణానికి చెందిన నారాయణరెడ్డి కాలనీవాసి ఎర్రోళ్ల శివకుమార్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మధుసూదన్ రెడ్డికి, మరో కూలీ వసీంకు గాయాలయ్యాయి. నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరికీ చికిత్స అందించి, శివకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ మధుసూదన్ రెడ్డి మద్యం మత్తులో డీసీఎం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.


శివకుమార్ మృతదేహం

యువకుడి కిడ్నాప్ కలకలం!

- అందోల్‌లోని బెడ్రూం ఇళ్ల వద్ద ఘటన
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జోగిపేట(అందోల్): యువకుడు కిడ్నాప్‌కు గురైన ఘటన జోగిపేట-అందోలు మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జోగిపేటలోని కాలేజీ రోడ్డులో లాండ్రీ షాపు నడుపుతున్న మల్లేశం (27) రోజూలాగే శుక్రవారం స్కూటీపై బియ్యం బస్తాతో ఇంటి నుంచి ఉదయం 5.30 గంటల ప్రాంతంలో బయలుదేరాడు. బయలుదేరిన పది నిమిషాల్లోనే స్కూటీ, బియ్యం బస్తా, చెప్పులు తన నివాసానికి సుమారుగా 100 మీటర్ల దూరంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. అక్కడే ఎఫ్ బ్లాక్‌లో ఉండే భార్యకు సమాచారం ఇవ్వగా ఆమె భర్త మల్లేశ్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని సందర్శించి ఇరుగు పొరుగు వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మల్లేశం ఫోన్ లొకేషన్ ట్రాప్ చేయగా పుల్కల్ మండలం ముదిమాణిక్యం రూట్ చూపెట్టడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లారు. చుట్టు పక్కలా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మల్లేశం కనిపించకుండా పోయిన ఘటన జోగిపేటలో చర్చనీయాంశమైంది.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్


మల్లేశం (ఫైల్)

డీఎస్పీ రమేశ్‌కుమార్ విచారణ

మల్లేశం కేసుకు సంబంధించి సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ విచారణ చేపట్టారు. ముదిమాణిక్యం గ్రామానికి వెళ్లి విచారించారు. మల్లేశం కుటుంబ సభ్యులను పిలిచి భార్యాభర్తలు గొడవ పడ్డారా? ఇతర గొడవలేమైనా ఉన్నాయా? అన్న విషయాన్ని తెలుసుకున్నారు.